క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నరసరావుపేట టౌన్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ జి.ఎల్.వి.ప్రసాదరావు గురువారం తెలిపారు. పెద్దచెరువు ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

మహిళల భద్రతపై దృష్టి పెట్టండి

వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్

నరసరావుపేట టౌన్: మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ తెలిపారు. గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మహిళ పోలీస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్, సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు. రోజుల తరబడి ఇళ్లకు తాళాలు వేసి ఉంటే సమాచారాన్ని స్టేషన్‌లో అందించాలని, అటువంటి గృహాలపై సిబ్బందితో పర్యవేక్షణ చేపడతామన్నారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. శక్తి యాప్ గురించి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వంశీకృష్ణ, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



రొంపిచర్ల: మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఈపాస్ మిషన్‌లోని సమాచారం ప్రకారం గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విధిగా ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బిల్లు రసీదులను తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శివలలిత, తదితర అధికారులు పాల్గొన్నారు.

కనమర్లపూడిలో ఘనంగా ఆలయ వార్షికోత్సవం



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో శ్రీ నీలంపాటి అమ్మవారి దేవాలయం 5వ వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తులు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు పొంగళ్లు పొంగించి నూతన వస్త్రాలు అందజేసి తమ మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ పూజారి సారథ్యంలో అమ్మవారికి అభిషేకాలు అర్చనలు విశేష పూజలు ఘనంగా చేశారు. అమ్మవారిని నూతన వస్త్రాలు పూలదండలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారిని చిత్రపటాన్ని జెండాను మేళతాళాలతో ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు 800 మందికి అన్నదాన సంతర్పణ కార్యక్రమం గ్రామస్తులు ఏర్పాటు చేశారు.

మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన ఉండాలి

జిల్లా సంస్థాగత మేనేజరు శ్రీనివాసరావు



శావల్యాపురం: స్వయం సహాయక మహిళా సభ్యులు మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన కల్గియుండాలని జిల్లా సంస్థాగత నిర్మాణ మేనేజరు పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మన డబ్బు, మన లెక్కలు మహిళా సంఘాలకు సంబదించిన మొబైల్ యాప్,2.0, లోకోష్ యాప్‌లపై గ్రామ సంఘాల వీవోఏలతో, మండల మహిళా సమాఖ్య ఈసీ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన యాప్స్ పురోగతి వారం రోజుల వ్యవధిలో నూరుశాతం చేయాలన్నారు. మండలంలోని అన్ని సంఘాల్లోని సభ్యులకు జీవనోపాదులు మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీనిధి రికవరి 13 గ్రామ సంఘాల్లో బకాయిలు నిలిచాయని, పెండింగ్‌లో ఉన్ననటు వంటి బకాయిలు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా వీవోఏలు, సీసీలు బాధ్యత వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో ఏర్పాటు చేసిన లోకోష్ యాప్‌లో సభ్యులు సమగ్ర వివరాలతో పాటు ఆర్థిక లావాదేవీల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు) మేనేజరు వలేటి శివకృష్ణ, జీవనోపాదుల జిల్లా అధికారి జి.వాసుబాబు, ఎల్‌సీ ముంద్రు బ్రహ్మయ్య, మండల సమాఖ్యా అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, స్త్రీనిధి రాహుల్, సీసీలు రామారావు, కరుణమ్మ, మేరికుమారి పాల్గొన్నారు.

చిట్టడవి కాదిది !

ఇది మండల వనరుల కేంద్రం

- కొత్త భవనం మంజూరైనా నిర్మాణం చేపట్టకపోవడం దారుణం



చిట్టడవిని తలపిస్తున్న ఎమ్మార్సీ

బొల్లాపల్లి: మండల కేంద్రంలో మండల వనరుల కేంద్రం చిట్టడవిని తలపిస్తోంది. చుట్టూ కంప చెట్లు మొలచి, విష సర్పాలు సంచరిస్తున్నాయి. ఇక్కడ కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. మరుగు దొడ్లు, మంచి నీటి సౌకర్యం లేనేలేదు. అనేక పనుల మీద వచ్చే మహిళా ఉపాధ్యాయులు వాష్ రూమ్స్ లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండల వనరుల కేంద్రానికి స్థలం ఉన్నప్పటికీ చుట్టూ చెట్లు అల్లుకుపోయాయి. నెలవారీ జరగాల్సిన ఉపాధ్యాయుల సమావేశం స్థానికంగా ఉన్న మోడల్, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. దీంతో పాటు గత కొన్నేళ్లుగా మండల విద్యాశాఖాధికారులే ఇన్‌చార్జీలు కావడంతో దీని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మండల విద్యాశాఖాధికారులు మండల వనరుల కేంద్రంలో కనీస మౌలిక వసతుల గురించి దృష్టి సారించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

త్వరలో భవన నిర్మాణం

మండల వనరుల కేంద్రానికి నూతన భవనం మంజూరైంది. నూతన భవనం త్వరలో నిర్మాణం చెప్పడతారు. ఉపాధ్యాయ సమావేశాలు ఎమ్మార్సీలో కాక స్థానికంగా ఉన్న హైస్కూల్స్ లో నిర్వహిస్తున్నాం. నూతన భవనంలో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నాం.

– కె పార్వతి, మండల విద్యాశాఖాధికారి



మండల వనరుల కేంద్రం

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



చిలకలూరిపేట: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఇటీవల నూతన ఎంఈవోగా నియమితులైన బి.సత్యనారాయణ సింగ్‌ను గురువారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్, మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లు అప్‌డేట్ చేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఎరియర్ బిల్స్, సరండర్ లీవ్ బిల్స్ త్వరగా మంజూరు చేయాలన్నారు. వేసవి సెలవుల్లో చేసిన సంపాదిత సెలవలను సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు శాలువతో సత్కరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఈవో సత్యనారాయణ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పోటు శ్రీనివాసరావు, మేకల కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, షేక్ మస్తాన్‌వలి, బి.అజయ్‌బాబు పాల్గొన్నారు.

అనధికార కుళాయిల క్రమబద్ధీకరణకు ఆమోదం

గ్రామసభలో ఆమోదం



మాట్లాడుతున్న మారుతీబాబు

నాదెండ్ల: గ్రామంలో అనధికారికంగా ఉన్న నీటి కుళాయిలను క్రమబద్ధీకరించుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎస్.మారుతీబాబు చెప్పారు. గణపవరం గ్రామ ఒకటో సచివాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో స్వరూపరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ అనధికారికంగా 800లకు పైగా నీటి కుళాయిలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా కుళాయిలు క్రమబద్ధీకరించుకోవాలని గ్రామ సభ నిర్ణయించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారు రూ.5 వేలు, ఓసీ, బీసీ కుటుంబాల వారు రూ.6 వేలు, వ్యాపార సంస్థలు రూ.7 వేలు, పరిశ్రమలు రూ.10 వేల చొప్పున చెల్లించాలన్నారు. చవిటిపాలెంలో కొన్ని వీధులకు పంచాయతీ నీరు సరిగా అందటం లేదని పలువురు మహిళలు గ్రామసభ దృష్టికి తెచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని కార్యదర్శి చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పెంటేల శేషయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు మాలెంపాటి లక్ష్మీనారాయణ, నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, గాలి బుచ్చయ్య ఉన్నారు.

హెచ్‌ఐవీ, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ రవి

నరసరావుపేట రూరల్: మాదకద్రవ్యాల వినియోగం, హెచ్‌ఐవీ పోరాటంలో యువతర ముఖ్య పాత్ర పోషించాలని ఐసీటీసీ కౌన్సిలర్ రవి తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సహకారంతో హెచ్‌ఐవీ, మత్తు పదార్థాల వినియోగ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని గురు వారం లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.ఆంజనేయ లు, ఐసీటీసీ కౌన్సిలర్ రవి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం విద్యార్థులు డ్రగ్స్ విని యోగానికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమని వివరించా రు. మన చుట్టూ జరిగే సామాజిక విషయాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, యవ్వన దశలో యువత సరైన లక్ష్యంతో జీవితంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఐవీ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ పి.ఎం.ఉదయరాజు విద్యార్థులకు తెలియజేశారు.

హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం

వినుకొండ: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గంగినేని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, మత్తు పదార్థాల వినియోగం విరమణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కొరకు డ్రగ్స్ వినియోగం చట్ట రీత్యా నేరమని తెలియజేశారు. ఐసీటీసీ కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ మన చుట్టూ జరిగే సామాజిక విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, హెచ్‌ఐవీపై పోరాటంలో యువత పాత్ర చాలా ముఖ్యమని తెలి పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పీఎం ఉదయరాజు, ఔట్ రీచ్ వర్కర్స్ జయలక్ష్మి, ఆశ, రమేష్, విజయ, రేహ్మాత, అనుష, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నగల చోరీపై కేసు

నాదెండ్ల: బంగారు నగల చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 3వ తేదీన ఈదర శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. నల్లపూసల గొలుసు, చెవిపోగులు కలిపి రూ.1.90 లక్షల విలువైన నగలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ నెల 3న ఈదర శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి ఓ ఫంక్షన్‌కు హాజరై 4న ఉద్యోగ రీత్యా హైదరాబాద్ వెళ్లి అటు నుంచి చెన్నై వెళ్లాడు. ఆయన తల్లి శ్రీనివాసరావుకు ఫోన్ చేసి నీకిచ్చిన బంగారు నగలు ఎక్కడ పెట్టావంటూ అడిగింది. దీంతో ఆ నగలు ఇంట్లోని టేబుల్‌పై పెట్టానని సమాధానం ఇవ్వటంతో, నగలు కనబడటం లేదని ఆమె తెలిపింది. ఇంట్లోని సీసీ పుటేజీని పరిశీలించగా 3న రాత్రి గుర్తు తెలియని ఇరువురు వ్యక్తులు ఇంట్లోకి వచ్చి బంగారు నగల చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రాప్ ఔట్స్ విద్యార్థులను స్కూల్లో చేర్పించాలి

వినుకొండ: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఏఎల్ఎస్‌సీ శ్రీనివాసరావు, సీఎంవో పద్మారావు, ఎంఐఎస్ శంకరరాజులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రాప్ ఔట్స్ విద్యార్థులను స్కూల్లో జాయిన్ చేయించాలని సూచించారు. ఓటీపీ ద్వారా బయోమెట్రిక్ ఎలా వేయాలో తెలియజేయడం జరిగిందన్నారు. యూడీఐఎస్ఈ ప్రోగ్రెషన్‌పూర్తి చేయడంపై అవగాహన కల్పించారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



వినుకొండ: రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన విజయవాడ వెన్యూ ఫంక్షన్ హాల్‌లో పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షులు శశికుమార్ సూచన మేరకు సంచార జాతుల సాంస్కృతి వారధులు విముక్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలోని సంచార జాతుల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాన్ బాబు, గొల్ల మస్తాన్‌రావు, పెనుగొండ గాంధీ, బండి వెంకటేశ్వర్లు, శివాజీ వెంయ్య, లాయర్ అప్పారావు, కర్రె అనిల్, అప్పరాజా, పత్తి మణికంఠనాయుడు, ఎస్సీ నాయకులు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై యువత దృష్టిసారించాలి

కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాధరావు



మాట్లాడుతున్న జగన్నాధరావు

నరసరావుపేట రూరల్: నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని కేఎల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాధరావు తెలిపారు. పెట్లూరివారిపాలెంలో ఏఎం రెడ్డి విద్యాసంస్థల ఇంక్యూబేషన్ సెంటర్, ఏసీఐసీ-కేఎల్ స్టార్టప్ ఫౌండేషన్ సహకారంతో లాం ఫ్ డ్ ఇన్నోవేషన్ ఓరియెంటేషన్ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కేఎస్ జగన్నాధరావు, ఏసీఐసీ కేఎల్ స్టారప్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.రమాకాంత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ ఆవిష్కరణల ప్రాముఖ్యత, స్టార్టప్ కల్చర్, పరిశోధన ఆధారిత అలోచన విధానం, భవిష్యత్‌లో లభించే అవకాశాలు, వాటి సద్వినియోగం చేసుకునే మార్గాలను వివరించారు. నూతన ఆవిష్కరణలతో దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమని తెలిపారు. యువతలో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని సరైన దిశలో ఉపయోగించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున్, డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చవితి పందిళ్ల ఏర్పాటులో సూచనలు పాటించాలి

రూరల్ సీఐ పి.రామకృష్ణ



నరసరావుపేట రూరల్: వినాయక పందిళ్లు ఏర్పాటుచేసి వేడుకలు నిర్వహించే కమిటీలు పోలీసుల సూచనలు పాటించాలని రూరల్ సీఐ పి.రామకృష్ణ గురువారం తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించుకునేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న సూచనలను తప్పనిసరిగా పాటించాలని భక్తులకు, నిర్వాహకులకు స్పష్టం చేశారు. విగ్రహ ప్రతిష్టకు ముందుగానే పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం కలిగించే ప్రదేశాలలో మండపాలను ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. విగ్రహాలకు 24 గంటల భద్రతను నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాలని, నలుగురు వలంటీర్లు విధులు నిర్వహించాలని తెలిపారు. బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో డ్యాన్స్ కార్యక్రమాలు, బాణసంచా కాల్చడం, రంగుల చల్లడం నిషేధమన్నారు. నిమజ్జనాలు రాత్రి 11 గంటల లోపు పూర్తి చేయాలని తెలిపారు. నిమజ్జన ఊరేగింపులో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని తెలిపారు.

ప్రమాదంలో ఆర్‌యూబీ రెయిలింగ్



రెయిలింగ్ సమీపంలో పయాణిస్తున్న ఆటో

నరసరావుపేట: పట్టణంలోని స్టేషన్‌రోడ్డు నుంచి ప్రకాష్‌నగర్‌కు వెళ్లేందుకు గాంధీపార్కుకు పక్కన ఏర్పాటు చేసిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)లోని ఫుట్‌పాత్ రెయిలింగ్ ప్రమాదకరంగా మారింది. స్టేషన్‌రోడ్డువైపు రెయిలింగ్ చివర్లను కలుపుతూ ఏర్పాటుచేసిన రాడ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఊడబెరికారు. దీంతో రెయిలింగ్‌లోని చువ్వలు ఒకటొకటిగా విడిపోయాయి. దీంతో పాటు రెయిలింగ్ కూడా వాహనాలు ప్రకాషనగర్ ప్రయాణించే వైపుకు వాలింది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ఇనుపచువ్వలను ఢీకొని తీవ్ర రక్తగాయాలు అయ్యే ప్రమాదం పొంచి ఉంది. అందువలన వెంటనే మున్సిపల్, రైల్వే అధికారులు ఈ రెయిలింగ్‌ను సరిచేయాల్సిన అవసరం కన్పిస్తుంది.

ముమ్మరంగా వరి నారుమళ్లు

- 250 హెక్టార్‌లో వరినారుమళ్ల సాగు
- వర్షానికి దెబ్బతిన్న వరినారుమళ్లు
- నాట్లు ఆలస్యమవుతాయంటున్న రైతులు



లేత వరినారు మడి



వర్షానికి విత్తనాలు మురిగిపోయి మొలకెత్తిన వరి

రొంపిచర్ల: మండలంలో ముమ్మరంగా వరినారుమళ్ల సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సార్వా సీజన్‌లో మండలంలో 41 వేల ఎకరాల్లో వరిపంట సాగు చేయాల్సి ఉంది. ఈ మొత్తం పొలం సాగు చేసేందుకు ఎక్కువ మంది రైతులు దమ్మువరి నారుమళ్ల సాగుపైనే దృష్టి పెట్టారు. అయితే ఇప్పటికే 250 హెక్టార్‌లో వరినారు మళ్ల సాగు ప్రారంభించారు. ఇంకా వరినారుమళ్ల సాగు చేయాల్సి ఉంది. ఎకరా వరిసాగు చేసేందుకు మూడు నుంచి నాలుగు సెంట్ల భూమిలో వరినారు మళ్ల సాగు చేయాల్సి ఉంది. వరినారు మళ్లసాగు ప్రారంభించి రెండు వారాలు కావస్తుంది. ఆగస్టు రెండోవారం సాగు చేసిన వరి నారుమళ్లకు వాతావరణం పూర్తిగా అనుకూలించింది. మూడవ వారంలో సాగు చేసిన వరినారు మళ్లకు వర్షం కొంత ఇబ్బంది కలిగించటంతో కొంత నారు నష్టపోయారు. దీంతో వరి విత్తనాలు కుళ్లిపోయి నారు పలుచగా మొలిసింది. వర్షానికి దెబ్బతిన్న వరినారుమళ్ల రైతులు అదనంగా నాలుగు రోజుల నుంచి వరినారుమళ్లను సాగు చేస్తున్నారు. ముదురుగా సాగుచేసిన వరినారుమళ్లు వర్షానికి దెబ్బ తినటంతో పది రోజులు ఆలస్యంగా అవసరమైన మేరా తిరిగి వరినారుమళ్ల సాగు ప్రారంభించారు. దీంతో వరినాట్లు సాగు కొంత మేర ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు వెల్లడించారు. కాల్వలకు చివరిలో ఉన్న భూముల్లో వరి సాగు చేసే రైతులు ఈ నెలాఖరులో వరినారు మళ్ల సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభం

యడ్లపాడు: బోయపాలెంలోని అనంతలక్ష్మి స్పిన్నింగ్ మిల్స్ ఆవరణలో సామినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన బసవతారకం ఇండో అమెరికన్ హాస్పిటల్, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ గూడూరు సత్యనారాయణ పాల్గొన్నారు. రాష్ట్రాలు ఆర్థికసమస్యలతో ప్రజారోగ్యంపై సరైన దృష్టి పెట్టలేకపోతున్నాయని, కేంద్రప్రభుత్వం నూతనవిధానాలతో దేశ ప్రజల నాణ్యమైన ఆరోగ్యరక్షణ దిశగా ఆలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో పారుపల్లి నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఎస్.సదాశివరావు, కె.సాయిబాబు, ముద్దన నాగేశ్వరరావు, కందుల రమణ, కందిమళ్ల రఘురామారావు తదితరులు పాల్గొన్నారు. క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం శుక్రవారం కొనసాగుతుందని చైర్మన్ సామినేని కోటేశ్వరరావు తెలిపారు.

ధ్వజానికి గ్రామోత్సవం



రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయ ధ్వజ స్తంభాన్ని గురువారం గ్రామానికి తెచ్చారు. ఈ సందర్భంగా ధ్వజానికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో కానుకలు, ప్రసాదాలు అందించారు.

CHANGE OF NAME

I, KAMIREDDY PADMA (New Name), W/o. Srinivasa Reddy, aged about 54 years, Resident of Door No.3-25-33, Peddacheruvu, 8th line, Narasaraopet Town, Palnadu District, Andhra Pradesh, do hereby solmnly affirm and state that I have changed my name from KAMIREDDY PADMAVATHI (Old Name) to KAMIREDDY PADMA (New Name).

ఇటొస్తే.. వెళ్లేది ఆస్పత్రికే!





గణపవరం–చిలకలూరిపేట డొంక రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అధ్వానంగా తయారైంది. రెండు కిలోమీటర్ల నిడివిలో గుంతలమయంగా మారి వర్షపునీరు చేరి బురదమయమైంది. వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆదిపరాశక్తి ఆలయం సమీపంలో కల్వర్టు వద్ద గొయ్యి ఏర్పడింది. గత వేసవిలో కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు మరమ్మతులు నిర్వహించారు. సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవటంతో రోడ్డు దెబ్బతింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కచ్చా డ్రైన్లు పూడిపోవటంతో మురుగు నీరు పారుదల లేక రోడ్లపైనే ప్రవహించింది. గణపవరం గ్రామానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించటంతో మున్సిపల్ అధికారులు ఆదిపరాశక్తి ఆలయం నుండి హైవే వరకూ రోడ్డుకు ఇరువైపులా కాలువల్లో పూడికలు తీయించారు. పూడిక మట్టిని రోడ్డు పక్కనే పోశారు. ఇటీవలి వర్షాలకు మట్టి రోడ్డుపైకి జారి తారు రోడ్డు కాస్తా మట్టిరోడ్డును తలపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పూడికతీసిన మట్టిని తొలగించాలని, రోడ్డుపై గుంతలు పూడ్చి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– నాదెండ్ల